'స్థానిక' ఎన్నికల్లో

ఒంటరిగానే పోటీ



- హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- మన దేశంపై అమెరికా పెత్తనం సహించేది లేదు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం

8



1000 అడుగుల జాతీయ జెండాతో

నగరంలో భారీ ర్యాలీ

- ర్యాలీని ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టును పురస్కరించుకొని ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు తారకరామా ఆటోనగర్‌లో గల ఫోర్ వీలర్స్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 1000 అడుగుల జాతీయ జెండా ర్యాలీని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరిలో భారతీయత ఉట్టిపడేలా జాతీయ జెండాలతో ర్యాలీలో పాల్గొనాలన్నారు. ఆ తర్వాత కుల మతాలకు అతీతంగా కార్మికులు జాతీయ జెండాలను పట్టుకొని ఖమ్మం నగర పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని బైపాస్ రోడ్డు కాలవోడ్డు నుంచి జడ్పీ సెంటర్, ఐటీ హబ్ సర్కిల్ మీదుగా ఇందిరానగర్ వరకు ర్యాలీ కొనసాగింది. భారత్‌మాతాకీ జై అంటూ ఖమ్మం పురవీధులు మార్మోగాయి. ఈ కార్యక్రమంలో తారకరామా ఆటోనగర్ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జున్, రవి, జానీ పాషా, కిషోర్, శ్రీనివాసరావు, చామేందర్ రెడ్డి, సీతారాంరెడ్డి, కార్మికులు పాల్గొన్నారు.



సీఎం పర్యటించే ప్రదేశాన్ని ఎస్పీతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారె

21న సీఎం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే, ఎస్పీ
- ఇళ్ల నిర్మాణంలో బెండాలపాడు రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి : కలెక్టర్ జితేష్ వి పాటిల్

8

'సీతారామ'

నీటి విడుదలకు ఏడాది

- రూ.19,325కోట్లకు పెరిగిన వ్యయం
- వచ్చే ఏడాది ఆగస్టు 15నాటికి పనులు పూర్తి చేస్తామన్న సీఎం హామీ నెరవేరేనా !?



గతేడాది సీతారామ మూడు లిఫ్టులను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, పక్కన ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి (ఫైల్)

ఖమ్మం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల ఆశాదీపం సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల చేసి నేటికి ఏడాది అవుతోంది. గతేడాది ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా మూడు లిఫ్టులను ప్రారంభించి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా కృష్ణా ఆయకట్టులోని సాగర్ కెనాల్‌కు వదిలారు. తద్వారా గోదావరి జలాలను కృష్ణమ్మ ఒడికి పంపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైరాలో జరిగిన రైతు సభలో 2026, ఆగస్టు 15 నాటికి సీతారామకు సంబంధించి అన్ని పనులు పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఆయకట్టుకు నీరందిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం సీతారామ అంచనా వ్యయం పెరగడంతో ఇటీవల కేబినెట్‌లో కూడా ఆమోదించారు. రూ.13,057 కోట్ల వ్యయంతో గత ప్రభుత్వం చేపట్టిన ఈ పనులు పెరిగిన అంచనాతో ప్రస్తుతం రూ.19,325కోట్లకు చేరింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా సీతారామ (మిగతా 8వ పేజీలో)

ఖమ్మం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/కొత్తగూడెం: బంగాళఖాతంలో అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారు జాము వరకు వర్షం దంచి కొట్టింది. మరికొన్ని ప్రాంతాల్లో ముసురు వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో 62.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో అత్యధికంగా మధిరలో116.8 మి.మీ, పెనుబల్లి 110.4మి.మీ.,సత్తుపల్లి107.4మి.మీ., వేంసూరులో 101.2మి.మీ, ఎర్రుపాలెంలో 81.2మి.మీ, వర్షపాతం పడింది. మండలాల వారీగా పరిశీలిస్తే.. సింగరేణి 40.0మి.మీ., కామేపల్లి 42.4మి.మీ, రఘునాధపాలెం 44.6మి.మీ, ఖమ్మంరూరల్ 35.6మి.మీ, తిరుమలాయపాలెం



దంచికొట్టిన వాన

- ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం
- 62.6 మి.మీ. సగటు వర్షపాతం నమోదు
- పొంగుతున్న వాగులు, వంకలు
- విప్పలమడక వద్ద కూలిన లింగన్నపాలెం సాగర్ బ్రాంచి కెనాల్ లైనింగ్
- భద్రాద్రి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యధికం

24.6మి.మీ.,కూసుమంచి 87.8మి.మీ., నేలకొండపల్లి 53.2మి.మీ., ముదిగొండ 70.6మి.మీ., చింతకాని 71.2మి.మీ, ఖమ్మం అర్బన్ 25.6మి.మీ, కొణిజర్ల 38.2మి.మీ, ఏన్కూరు 69.6మి.మీ, కల్లూరు 55.2మి.మీ, పెనుబల్లి 110.4మి.మీ, సత్తుపల్లి 107.4మి.మీ, వేంసూరు 101.2మి.మీ., తల్లాడ 30.2మి.మీ, వైరా 21.2మి.మీ., బోనకల్‌లో 78.4మి.మీ వర్షపాతం పడింది. వరుస వర్షాలతో జిల్లాలోని పాలేరు, వైరా ప్రాజెక్టులు నిండాయి. లంకసాగర్ 16అడుగులకు గాను 11.6 అడుగులకు చేరింది. చెరువుల్లో జల కళ కనిపిస్తోంది. మున్నేరు కూడా ఎగువన కురిసిన వర్షాలతో జలకళను సంతరించుకుంది. జిల్లాలో అనేక వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో వర్షాలు, వరదలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు. హైదరాబాద్ నుంచి రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని చెరువుల్లో జలకళ కనిపిస్తోంది. వర్షాల కారణంగా పంటలు కూడా కళకళలాడుతున్నాయి. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. నీటి పారుదల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు చెరువులకు ఎక్కడైనా గండ్లు పడితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోక్లెయినర్లు సిద్ధం చేశారు.

జిల్లాలో వర్షాల కారణంగా తల్లాడ మండలంలోని మాచవరం వాగు పొంగి ప్రవహించడంతో.. రాకపోకలకు అంతరాయం కలిగింది. వైరా మండలం తాటిపుడి వద్ద మీరాబీ అనే మహిళ పూరిపాక ఇల్లు వర్షానికి కూలింది. వైరా మండలం విప్పలమడక వద్ద సాగర్ ఎడమకాలవ లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్ లైనింగ్ వంద మీటర్ల పొడవున నిర్మాణంలో ఉన్న లైనింగ్ పనులు వర్షానికి కూలిపోయాయి. సుమారు రూ.5లక్షల వరకు నష్టం జరిగింది. కూసుమంచి మండలం నర్సింహులగూడెం- కొత్తూరు, (మిగతా 8వ పేజీలో)

భారీ వర్షాల నేపథ్యంలో

అప్రమత్తంగా ఉండండి

- ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా చూడండి
- వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ.కోటి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు

8



వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి, సీఎస్ రామకృష్ణ, హాజరైన కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న

మోదీ ప్రభుత్వం

- రాజ్యాంగాన్ని కాపాడేందుకు కృషి
- కొవ్వొత్తుల ర్యాలీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

10

'పెద్దపులి' కోసం

గాలింపు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీ అధికారులు

8

స్వాతంత్ర్య వేడుకలకు

ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

- నేడు 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు
- డిప్యూటీ సీఎం చేతుల మీదుగా జాతీయ జెండా ఆవిష్కరణ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 79వ స్వాతంత్ర్య దినోత్సవాలకు ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ ముస్తాబయింది. ఈ వేడుకలను పురస్కరించుకుని జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 9- 30 గంటలకు రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తారు. ఆ తర్వాత సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఆ తర్వాత ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను భట్టి విక్రమార్క అందజేస్తారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా ప్రముఖులు, అధికారులు పాల్గొంటారు. వర్షం కారణంగా స్వాతంత్ర్య వేడుకలకు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు ఆలస్యం అయ్యాయి. వాస్తవానికి బుధవారం సాయంత్రమే పూర్తి చేయాల్సి ఉండగా.. గురువారం ఉదయానికి సిద్ధం చేశారు. వేడుకలకు భద్రత, బందోబస్తు, పోలీసుల కవాతు రిహార్సల్స్ తదితర అంశలపై సీపీ సునీల్‌దత్ పర్యవేక్షిస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ జెండాను ఎగురవేస్తారు. ఖమ్మంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వరంగల్ జిల్లాలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించనున్నారు.

మున్నేరు ముంచుకొస్తోంది!

- ముంపు బాధితుల గుర్తింపులో కొరవడిన ముందుచూపు
- పరివాహక ప్రాంత కుటుంబాలపై జరగని సర్వే
- గతేడాది బాధితులు ఇప్పటికీ కేఎంసీ చుట్టూ ప్రదక్షిణలు
- గత అనుభవాలను పట్టించుకోని అధికారులు
- గరిష్ఠ పరిహారం చెల్లిస్తున్నా ప్రభుత్వానికి తప్పని అపవాదు



ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గతేడాది మున్నేరు ముంపు అనుభవాలను చూసైనా అధికారులు పాఠాలు నేర్వనట్టున్నారు. ఈఏడాది అలాంటి పరిస్థితి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులు, కలెక్టర్ ఎప్పటికప్పుడు సూచిస్తున్నా.. ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్న జాడలు కనిపించడం లేదు. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2024 సెప్టెంబరు 1న మున్నేరుకు వచ్చిన వరద పోటు పరివాహక ప్రాంతంలోని ప్రజల్ని నిరాశ్రయులను చేసింది. మరుసటి రోజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందరూ స్పందించారు. 104 డిగ్రీల జ్వరంలో కూడా మంత్రి తుమ్మల ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ప్రభుత్వం తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు.ఆయన చెప్పిన విధంగానే 48గంటల్లోపు బాధిత కుటుంబాలకు మౌలిక సౌకర్యాలు కల్పించారు. తర్వాత రెవెన్యూ విభాగంతో సర్వే చేయించి.. సుమారు 10వేల బాధిత కుటుంబాలకు గతంలో ఎప్పుడూ ఇవ్వని విధంగా గరిష్ఠంగా రూ.16,500 చొప్పున పరిహారాన్ని బ్యాంకు ఖాతాల్లో జమచేయించారు.

ముంపునకు గురైన 15 డివిజన్లు

నాడు ఆకస్మికంగా వచ్చిన మున్నేరు వరదతో నగరంలోని 16, 17, 28, 29, 30, 34, 35, 46, 47, 48, 59, 60 డివిజన్లు ముంపునకు గురయ్యాయి. 46, 47, 48 డివిజన్లలో ఇళ్ల పైకప్పు సహా లేచి పోయాయి. బొక్కలగడ్డ, వెంకటేశ్వర నగర్, జూబ్లీపుర, దానవాయిగూడెం, రామన్నపేట ప్రాంతాల్లోని ప్రజలు బీరువాల్లో దాచుకున్న బంగారం, విలువైన పత్రాలు, నగదుతోపాటు బియ్యం, నిత్యావసర సరుకులు, దుస్తులు, విద్యుత్ ఉపకరణాలు, చేతివృత్తి పనిముట్లు, ద్విచక్ర వాహనాల ఇలా చాలా కొల్పోయారు. నాడు ఈ డివిజన్లతో పాటు మైదాన ప్రాంతంలోని 10, 11, 15డివిజన్లు కూడా ముంపునకు గురయ్యాయి.

అధిక మొత్తంలో పరిహారమిచ్చినా..

గతేడాది వరదల సమయంలో మున్నేరు ముంపు బాధిత కుటుంబాల జాబితాలు ఇటు ఖమ్మం నగర పాలక సంస్థ అధికారుల వద్ద కానీ.. అటు రెవెన్యూ అధికారుల వద్ద కానీ లేకపోవడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర పాలక సంస్థ అధికారుల పర్యవేక్షణలో సర్వే నిర్వహించారు. సెప్టెంబరు 1న ముంపు రాగా 2వ తేదీన ప్రత్యేక బృందాల ను ఏర్పాటు చేసి సర్వే పూర్తి చేశారు. మొదటి సర్వే ప్రకారం సెప్టెంబరు 5 నుంచి బాధిత కుటుంబాలకు రూ.16,500 చొప్పున బ్యాంకు ఖాతాలకు డబ్బులు జమ చేశారు. తర్వాత నిజమైన బాధితులకు డబ్బులు అందలేదని కార్పొరేటర్లు, బాధితులు గొడవలు చేయటంతో సెప్టెంబరు2వ వారంలో మరో సర్వే నిర్వహించి.. రెండో జాబితాను గుర్తించారు. అలాగే అక్టోబరు, నవంబరు నెలల్లో కూడా బాధితులు కేఎంసీ చుట్టూ తిరిగి న్యాయం చేయాలని కోరడంతో వారి నుంచి వినతులు స్వీకరించి సర్వేలు జరిపారు.ఇలా ప్రభుత్వం దశల వారీగా 10వేల కుటుంబాలకు పైగా పరిహారం చెల్లించింది. ఇదంతా జరిగి ఏడాది గడిచినా ఇప్పటికీ పరిహారం అందలేదని కొందరు బాధితులు కేఎంసీ చుట్టూ తిరుగుతున్నారు. కొంతమంది బాధితులు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులను తెప్పించి పరిహారం పొందారు. ఒక నివాసంలో మూడు గదులుంటే ఒక్కో గదికి ఒక్కో కుటుంబానికి పరిహారం అందించేలా స్థానిక కార్పొరేటర్లతో సిఫారసులు చేయించారు. కొన్ని నివాసాల్లో పదికి పైగా చెక్కులు పంపిణీ జరిగిందంటే అవకతవకలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

ఈ ఏడాది కానరాని ముందస్తు చర్యలు

గత మూడు నెలలుగా మున్నేరు వరదలపై కలెక్టర్ నుంచి ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ వరకు ముందస్తు చర్యలను ప్రారంభించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, డీఆర్ఎఫ్ బలగాలతో పాటు.. విపత్తులను ఎదుర్కొనేందుకు కావాల్సిన అన్ని ముందస్తు చర్యలను తీసుకున్నారు. కానీ ఇప్పటి వరకు మున్నేరు పరివాహక ప్రాంతంలో ఏ ఏ కుటుంబాలు ఉంటున్నాయి. అనే విషయంపై ఇంటింటి సర్వే జరపలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కువగా ముంపునకు గురై 46, 47, 48 డివిజన్లలో కూడా సర్వే జరపకపోవడం, అధికారులు కచ్చితమైన కుటుంబ సర్వే డేటా నమోదు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. మున్నేరు ముంపు ప్రాంతాల్లో వార్డు ఆఫీసర్లు, స్వచ్ఛంద సంస్థలు, ఆపద మిత్రాలు, మెప్మా ఆర్పీలు, అంగన్వాడీ, ఆశకార్యకర్తలు ఎంతో మంది అందుబాటులో ఉన్నారనే లెక్కలు స్పష్టంగా ఉన్నాయో లేవో తెలియని పరిస్థితి.

పొంగి ప్రవహిస్తున్న
వైరా రిజర్వాయర్



అలుగు పారుతున్న వైరా రిజర్వాయర్

వైరా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ 19 అడుగుల నీటిమట్టాన్ని దాటి పొంగి ప్రవహిస్తుంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు పరివాహక ప్రాంతంలోని వాగులు, ఏర్లు నుంచి భారీగా వరదనీరు వచ్చిచేరుతుంది. దాంతో గురువారం సాయంత్రానికి ఈ నీటిమట్టం 19అడుగులకు చేరుకుంది. వరదనీరు ఇదేవిధంగా కొనసాగితే నీటిమట్టం ఇంకా పెరిగే అవకాశముంది. రిజర్వాయర్‌లోని వరదనీరు అలుగుల నుంచి నదిలోకి పొంగి ప్రవహిస్తూ పరవళ్లు తొక్కుతుంది. స్నానాల లక్ష్మీపురం వద్ద వైరా నదిలో ఉన్న లోలెవల్ చప్టాపైనుంచి వరదనీరు పొంగి ప్రవహిస్తుంది. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, ఎస్‌ఐ పి.రామారావు ఈ వరదనీటిని పరిశీలించారు. అలాగే సోమవరం నల్లచెరువు అలుగు నుంచి భారీగా వరదనీరు వాగులోకి పొంగి ప్రవహిస్తుంది. గంగదేవిపాడు వాగు, రాళ్లవాగులు కూడా పొంగి ప్రవహిస్తున్నాయి.

కోయ భాష, తెలుగు లిపితో
స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రికలు



భద్రాచలం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 79వ స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్న క్రమంలో భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాల గురించి రూపొందించిన ఆహ్వాన ప్రతికలు కోయ భాష, తెలుగు లిపిలో ముద్రించారు. భద్రాచలం ఐటీడీఏ పీవోగా బీ రాహుల్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ప్రధాన ఉత్సవాలు, ఇతర వేడుకలకు సంబంధించి ఆహ్వాన పత్రికలను తెలుగుతోపాటు కోయ భాష తెలుగు లిపిలో ముద్రిస్తున్నారు. వీటిని వివిధ విభాగాల ప్రముఖులకు అందజేస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మార్చ్‌పాస్ట్‌కు విద్యార్థులు రిహార్సల్స్ నిర్వహించారు. ఈ సమయంలో పీవో వారికి పలు సూచనలు చేశారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం పొడిగింపు

మరో ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

సత్తుపల్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల అధ్యక్షుడు, సెంట్రల్ బ్యాంకు చైర్మన్ల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవో ఆర్టీ నెంబర్ 386 నెంబర్ ద్వారా సహకార సంఘాలు, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగించారు. ఆరు నెలల క్రితం సహకార పర్సన్ ఇన్‌చార్జ్ పదవీ కాలం పొడిగించగా ప్రస్తుతం ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేకపోవటంతో మరో ఆరు నెలలు పర్సన్ ఇన్‌చార్జ్‌ల పదవీ కాలం పొడిగిస్తూ ఉత్వర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్వర్వులు ఇచ్చారు. దీంతో మరో ఆరు నెలలు లేదా ఈ లోపు ఎన్నికలు జరిగితే అప్పటి వరకూ పాత కమిటీలు కొనసాగనున్నాయి.



బురద దారిలో నడుచుకుంటూ వెళ్తున్న వైద్య బృందం

రహదారి లేక..



చికిత్స చేస్తున్న వైద్యులు

- బురదలో మూడు కిలోమీటర్లు కాలినడక
- వలస ఆదివాసీ గ్రామం అంగారుగూడెంలో వైద్య శిబిరం

కరకగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా మారుమూల ఏజెన్సీ గ్రామాల ప్రజల సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయి. వైద్యాధికారి రవితేజ ఆధ్వర్యంలో వైద్య బృందం రహదారి సరిగా లేక బురదలోనే సుమారు మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. కరకగూడెం మండలంలోని వలస ఆదివాసీ గ్రామం అంగారుగూడెం గ్రామానికి వర్షాల వల్ల రహదారి బురదమయంగా మారింది. ఆ గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో గురువారం కరకగూడెం వైద్యాధికారి రవితేజ, తన సిబ్బందితో కాలినడకన సుమారు మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి అక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. బాలింతలకు ప్రత్యేక వైద్య చికిత్స చేశారు. నెలలు నిండిన గర్భిణులను ప్రసవం కోసం మణుగూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం గ్రామంలోని పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న క్రమంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటి పరిసరాలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పోలెబోయిన కృష్ణయ్య, హెచ్‌వీ భవాని, హెచ్‌ఏ నర్సింహారావు, ఏఎన్‌ఎం జ్యోతి, ఆశావర్కరు మాణిక్యం, ఆధార్ వ్యవస్థాపక అధ్యక్షుడు తోలెం రమేష్ పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ

- ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం
- భారతదేశంపై అమెరికా పెత్తనం సహించేది లేదు
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం



మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తామని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ప్రకటించారు. ప్రజా ఉద్యమాలు చేసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. గురువారం సాయంత్రం అశ్వారావుపేటలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఒకటి రెండు హామీలు అమలు చేస్తూ ప్రజలను ఆశ పెడుతున్నారన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలలో ఒంటరిగా పోటీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజా ఉద్యమాలు చేసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అమెరికా నుంచి సోయా, మొక్కజొన్న, కోడి మాంసం, పాల ఉత్పత్తులను మనదేశంలోకి పంపేందుకు ట్రంప్ సుంకాలు విధిస్తున్నారని, దీని ద్వారా మన ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా అమెరికా పోకడలపై మాట్లాడారని గుర్తుచేశారు. కేంద్రం కూడా చైనా మాదిరిగా నిర్దిష్ట విధానంలో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లాపై పాలకులు ఎనలేని నిర్లక్ష్యం చూపుతున్నారన్నారు. పెదవాగు ప్రాజెక్టు తెగి ఏడాది గడిచినా.. నేటికీ మరమ్మతులు చేపట్టలేదన్నారు. అంతకు ముందు మండలంలోని నందిపాడులో మాజీ సర్పంచి ఊకే వీరాస్వామి దశదిన కర్మలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కమిటీ నాయకులు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు పుల్లయ్య, మండల కార్యదర్శి ప్రసాద్, జిల్లా నాయకులు చిరంజీవి, సత్యనారాయణ, శ్రీనివాసరావు, వెంకటేశ్వరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గుతున్న
పాలేరు నీటిమట్టం



కూసుమంచి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) పాలేరు జలాశయం నీటిమట్టం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. బుధవారం రాత్రి 24.5 అడుగులున్న నీటిమట్టం 23.5 అడుగులకు చేరుకుంది. మొదటిజోన్ నుంచి 1210క్యూసెక్కులు, పరీవాహక ప్రాంతం నుంచి 8780 క్యూసెక్కులు పాలేరు వచ్చి చేరుతోంది. పాలేరు జలాశయం నుంచి రెండోజోన్‌కు 2043 క్యూసెక్కులు, ఫాలింగ్‌గేట్ల ద్వారా 7667క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. అదేవిధంగా ఎడమకాల్వ వరదనీరు పాలేరు జలాశయంచేరకుండా మొదటిజోన్ పరిధిలో రంగుల బ్రిడ్జివద్ద ఎస్కేప్ లాకులు ఎత్తివేశారు. దీంతో పొలాలన్నీ మునిగిపోతున్నాయంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేశారు.

'పెద్దపులి' కోసం
గాలింపు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన అటవీ అధికారులు



సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న అటవీ శాఖ అధికారులు

కరకగూడెం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి, ములుగు జిల్లా సరిహద్దులో పెద్దపులి సంచరిస్తున్నట్లు ఇరుజిల్లాల అటవీ శాఖ అధికారులు తెలుపుతున్నారు. గురువారం ఏడూళ్ళ బయ్యారం రేంజర్ తేజస్వీ ఆధ్వర్యంలో టైగర్ భద్ర జాడ కోసం ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ముసలమ్మ గుట్ట ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, వెంకటమ్మ, సూరయ్య, ఏడుకొండలు, బీట్ ఆఫీసర్లు అశోక్, రోజ, గోపి, కోటేష్, లక్ష్మి నర్సు, సురేష్, రాజేష్, స్వప్న, గోవర్ధన్, మోహన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి

- ఆస్తి, ప్రాణ నష్టం సంభవించకుండా చూడండి
- వరద సహాయక చర్యలకు జిల్లాకు రూ. కోటి
- వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు తుమ్మల, పొంగులేటి
- పాల్గొన్న ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కలెక్టర్లు

ఖమ్మం కలెక్టరేట్ / కొత్తగూడెం కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. వరదల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎస్ కే. రామకృష్ణారావుతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో పాటు భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల, పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలలో రెండు రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని తెలిపారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, ప్రజలకు ఎక్కడా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అవసరమైతే మరిన్ని నిధులను కూడా విడుదల చేస్తామన్నారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తిస్థాయిలో తీసుకోవాలన్నారు. రోడ్లు, క్యాజ్ వేల డామేజీ, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల డ్యామేజీ ఉంటే చేపట్టాలన్నారు. వైద్యపరంగా అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి సెలవులు ఇవ్వొద్దన్నారు. ఉమ్మడి జిల్లాలకు ఒక ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారిని నియమించి.. పర్యవేక్షణ చేస్తున్నట్లు అన్నారు. ఎక్కడ అనుకోని సంఘటనలు జరిగినా.. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. జిల్లాకు సంబంధించి ఇప్పటివరకు సమస్యలు లేవన్నారు. ఆకేరు, మున్నేరు, పాలేరు, వైరా, లంకాసాగర్‌లు నిలకడగా ఉన్నాయన్నారు. పొరుగున ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షపాతాన్ని బట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. రేపు, ఎల్లుండి వాతావరణ ప్రభావాన్ని బట్టి అప్రమత్తంగా ఉండాలన్నారు. కల్వర్టులు, క్యాజ్ వేల దగ్గర ప్రజలు దాటకుండా చూడాలని, చెరువులను నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి అన్నారు. సీఎస్ కే. రామకృష్ణారావు మాట్లాడుతూ.. వాతావరణ శాఖ సూచనల ప్రకారం మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసిందన్నారు. మిగిలిన ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపిందన్నారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో కలెక్టర్ వద్ద ఉన్న డిజాస్టర్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సీఎస్ సూచించారు. అనంతరం ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్ని రోడ్లు, క్యాజ్ వేలు బ్లాక్ అయినది అధికారులు వెంటనే నివేదిక సమర్పించాలన్నారు. అందరూ మండల అభివృద్ధి అధికారులు, తహసీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు వారి వద్ద అందుబాటులో ఉన్న వరద సహాయక పరికరాల వివరాలు ఇవ్వాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల డ్యామేజ్, పవర్ కట్ జరిగిన ప్రదేశాల వివరాలు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అన్ని చెరువులు సర్ ప్లస్ స్థాయిలో ఉండరాదని, గరిష్టంగా 85 నుంచి 90 శాతం నీరు ఉండేలా చూడాలన్నారు. వర్షాలు పడిన చోట యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య చర్యలు చేపట్టాలని, ఫీవర్ సర్వే ప్రారంభించాలని, పరీక్షలు ర్యాండంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఎస్ఈ శ్రీనివాసాచారి, మంగళపూడి. వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా అగ్నిమాపక, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

● భద్రాద్రి జిల్లాలో సాధారణ వర్షపాతం

వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ.. జిల్లాలో సాధారణ స్థాయిలో వర్షపాతం నమోదైందని తెలిపారు. చంద్రుగొండ మండలం మద్దుకూరు గ్రామంలో మాత్రం గరిష్టంగా 12.7 సెం.మీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదన్నారు. క్షేత్రస్థాయిలో ఇరిగేషన్, వ్యవసాయ శాఖాధికారులు పరిశీలన జరపాలన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాచలంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం, పాల్వంచలో ఎస్డీఆర్ఎఫ్ బృందం, కొత్తగూడెం డివిజన్ పరిధిలోని చాతకొండ బెటాలియన్‌లో వంద మంది పోలీసులు శిక్షణ పొంది ఉన్నారని తెలిపారు. అదేవిదంగా రోపులు, లైఫ్‌జాకెట్స్, టార్చ్‌లైట్స్ బోట్స్‌ను సిద్ధం చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, జడ్పీ సీఈఓ నాగలక్ష్మీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

21న సీఎం పర్యటన

- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారే, ఎస్పీ రోహిత్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్


చంద్రుగొండ, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): ఆదర్శ గ్రామం బెండాలపాడులోని ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించేందుకు ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వస్తున్నట్లు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు పర్యటన ఏర్పాట్లను గురువారం అశ్వారావుపేట ఎమ్మెల్యే, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఎస్పీ రోహిత్‌రాజుతో కలిసి బెండాలపాడులో పర్యటించారు. గ్రామంలో సీఎం సభ, హెలీప్యాడ్ ప్రాంగణాలతోపాటు ముఖ్యమంత్రి గ్రామంలో ప్రారంభించే ఇళ్లపై ఎమ్మెల్యే, ఎస్పీ చర్చించారు.

రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలి: కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం ఆదర్శ గ్రామంగా గుర్తించిన బెండాలపాడు రాష్ట్రానికే ఆదర్శ గ్రామంగా నిలిపేందుకు కృషి చేయాలని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులు, లబ్ధిదారులను కోరారు. గురువారం మండలంలోని బెండాలపాడులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ తీరుతెన్నులను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో సమావేశమై ఇళ్ల నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ బెండాలపాడు గ్రామంలో 310 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటికే 46 ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకొని గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కాగా మిగతా ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో వేగంగా కొనసాగుతున్నాయన్నారు.

మంత్రి హోదాలో అత్యధిక సార్లు
జాతీయజెండా ఆవిష్కరించిన తుమ్మల




ఖమ్మం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఉమ్మడి రాష్ట్రంలోను, తెలంగాణలోను రాష్ట్రమంత్రి హోదాలో అత్యధికసార్లు ఆగస్టు 15న జాతీయజెండా ఎగువరేసే అవకాశం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు దక్కుతుంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్టీఆర్, చంద్రబాబునాయుడు, రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్, ముఖ్యమంత్రి రేవంతరెడ్డి కేబినేట్‌లో మంత్రి హోదాలో ఆగస్టు 15 సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. శుక్రవారం ఆగస్టు 15 సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జాతీయ జెండా ఎగురవేయబోతున్నారు. తొలిసారి 1986 ఆగస్టు15న ఖమ్మం పోలీసుపరేడ్ గ్రౌండ్‌లో జాతీయ1989వరకు ఎన్టీఆర్‌కేబినేట్‌లో మంత్రిగా జెండా ఎగురవేశారు. తర్వాత చంద్రబాబు కేబినేట్‌లో 1995నుంచి 2024వరకు జాతీయజెండా ఎగురవేశారు. రాష్ట్ర విభజన అనంతరం కేసీఆర్ కేబినేట్‌లో మంత్రిగా ఖమ్మంలో 2015నుంచి 2018వరకు జాతీయజెండా ఎగురవేశారు. ఆతర్వాత మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి హోదాలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెంలో మంత్రిగా జాతీయజెండా ఎగురవేయనున్నారు. రాష్ట్ర మంత్రిగా అత్యధిక సార్లు జాతీయజెండా ఎగురవేసే అవకాశం మంత్రి తుమ్మలకు దక్కుతుంది.

దంచికొట్టిన వాన

(7వ పేజీ తరువాయి)

చేగొమ్మ- తాళ్లచెరువు, జీళ్లచెరువు-చేగొమ్మ మధ్య రాకపోకలునిలిచాయి. సింగరేణి ఓపెన్‌కాస్టులో 30వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది.

భద్రాద్రి జిల్లాలో...



ఎదుళ్ల వాగు వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ భారీ వర్షపాతం పడింది. జిల్లాలో బుధవారం రాత్రి నుంచి మొదలైన వర్షం గురువారం తెల్లవారుజాము వరకు కొనసాగింది. పెద్ద ఎత్తున వర్షం పడడంతో పొలాలు నీట మునిగాయి. చెరువులు, వాగులు వంకలు పొంగిపొర్లాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా చంద్రుగొండ మండలంలోని మద్దుకూరులో 12.78 సెం.మీ వర్షపాతం నమోదైంది. అలాగే అశ్వారావుపేటలో 10.3 సెంమీ, బూర్గంపాడులో 8.25, దమ్మపేట మండలం అంకంపాలెంలో, భద్రాచలంలో 7.55, చుంచుపల్లి మండలం గరిమెళ్లపాడులో 7.5, దుమ్ముగూడెంలో 7.4, దమ్మపేట మండలం మందపల్లిలో 7.38, అన్నపురెడ్డిపల్లి పెంట్లంలో 7.2 సెంమీ, పాల్వంచ మండలం సీతారామపురంలో 6.4, దమ్మపేట మండలం నాగుపల్లె లో 6.1, లక్ష్మీదేవిపల్లిలో 5.78, సుజాతనగర్‌లో 5.65, కొత్తగూడెంలో 5.2 సెంమీ వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత టేకులపల్లిలో 4.4, మణుగూరు లో 4.1, మణుగూరులో 3.8, పాల్వంచ మండలం యానంబైలులో 3.6, చర్ల మండలం సత్యనారాయణపురం 2, ఆళ్లపల్లి మండలంలో 1.98 సెంమీ వర్షపాతం నమోదైంది.

'సీతారామ' నీటి విడుదలకు ఏడాది

(7వ పేజీ తరువాయి)

లిఫ్టులు నిర్మించి వంద కి.మీ మేర ప్రధాన కాలువను తవ్వి వదిలేశారు. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి నుంచి గ్రావిటీ ద్వారా గోదావరి జలాలను బీజీ కొత్తూరు వద్ద ఎత్తిపోతలను నిర్మించారు. అక్కడ నుంచి లిఫ్టుద్వారా ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద రెండో లిఫ్టు ఏర్పాటు చేశారు. మూడో లిఫ్టు ములకలపల్లి మండలం కమలాపురం వద్ద నిర్మించారు. పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేసేందుకు జూలూరుపాడు వద్ద వంద కి.మీకు పైగా తవ్వి వదిలేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రుల బృందం సీతారామ ప్రారంభం నుంచి చివరి వరకు పనులు పరిశీలించి సాగర్ ఎడమ కాలువకు సీతారామ ప్రధాన కాలువను అనుసంధానం చేసే ఏన్కూరు లింక్‌కెనాల్ పెరిగిన అంచనాలకు ఆమోదం తెలిపారు. సుమారు రూ.90కోట్లు మంజూరు చేసి ఏన్కూరు లింక్ కెనాల్ పూర్తిచేసి రాజీవ్ లింక్‌కెనాల్‌గా పేరు పెట్టారు. గతేడాది ముఖ్యమంత్రి చేతుల మీదుగా సీతారామ ఎత్తిపోతలను లిఫ్టులను ప్రారంభించి గోదావరి జలాలను ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఎడమ కాలువకు అనుసంధానం చేసి నీటిని వదిలారు. దీంతో అసంపూర్తిగా ఉన్న సీతారామ ఎత్తిపోతల వినియోగంలోకి వచ్చింది.

అనంతరం సీతారామకు సంబంధించిన పాలేరు లింక్‌కెనాల్ ,యాతాలకుంట టన్నెల్ పనులు కూడా వేగవంతంగా చేపడుతున్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరక సీతారామలోని మిగిలిన ప్యాకేజీల టెండర్లు కూడా పూర్తి చేశారు. ప్రాజెక్టు అంచనాలు పెరగడంతో ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన మంత్రివర్గం సమావేశంలో పెరిగిన అంచనాలకు ఆమోదం లభించింది. దీంతో సీతారామకు నిధుల సమస్య తప్పింది. ఇప్పటికే రాజీవ్ లింక్‌కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు అనుసంధానం చేసి ఇటీవల వర్షాభావ నేపథ్యంలో వైరా రిజర్వాయర్‌కు కల్లూరు వైపుగా గోదావరి జలాలను పంపి పంటలను కాపాడగలిగారు. గతేడాది పాలేరు వరదకారణంగా అప్రోచ్ కొట్టుకుపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడినప్పుడు సీతారామ ద్వారా గోదావరి జలాలను వదిలి కల్లూరు తదితర మండలాల రైతుల పంటలను కాపాడగలిగారు. ఉమ్మడి జిల్లాలో పలు నియోజకవర్గాల్లో రూ.3500కోట్లతో 8 డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్‌కు టెండర్లు చేపట్టారు.

ప్రస్తుతం ఇందుకు భూసేకరణ కొనసాగుతోంది. తద్వారా ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాల పరిధిలోని 11 నియోజకవర్గాలు, 31 మండలాల్లో 3లక్షల29వేల ఎకరాల కొత్త ఆయకట్టు సాగులోకి రాబోతుంది. ప్రస్తుతం సాగర్‌తో పాటు పలు చెరువులు కింద 3లక్షల45వేల ఎకరాలు స్థిరీకరణ జరగనుంది. కేబినేట్ ఆమోదంతో నిధుల సమస్య తీరడంతో భూసేకరణ వేగవంతం అయి డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు వేగంగా జరగనున్నాయి. వచ్చే ఆగస్టు 15కల్లా సీతారామ పనులు పూర్తయితే ఉమ్మడి జిల్లా మరింత సస్యశ్యామలం కానుంది.



రేపు నాస్తిక అధ్యయన తరగతులు

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శనివారం నగరంలో నాస్తిక అధ్యాయన తరగతులు నిర్వహిస్తున్నామని నాస్తిక సమాజం కన్వీనర్ చార్వాక సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. ప్రకృతి, సైన్స్, సామాజిక సైన్స్‌ను ప్రజలకు అవగాహన కల్పించటమే లక్ష్యంగా నాస్తిక అధ్యాయన తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్ఎస్పీ క్యాంపులోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే నాస్తిక అధ్యాయన తరగతులకు ప్రజలు భారీగా హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఆవుల అశోక్, సీహెచ్ రమేశ్ బాబు, విజ్ఞాన దర్శని నాగరాజు, సమతా శ్రీధర్, సత్యనారాయణ, ప్రీతమ్ పాల్గొన్నారు.

అటవీశాఖలో ఇంటి దొంగలు

- అడవుల ఆక్రమణకు పరోక్ష సహకారం
- ఏకంగా డోజర్లు, జేసీబీలతో చదును
- సింగరేణి బీట్ ఆఫీసర్ సస్పెన్షన్, మరొకరిపై విచారణ

ఖమ్మంసంక్షేమవిభాగం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): అడవుల ఆక్రమణకు అందులో పని చేసే కొందరు పరోక్షంగా సహకరిస్తున్నారు. దీనిపై బహిరంగంగా విమర్శలు వెలువడటంతో విచారణ చేపట్టిన ఖమ్మం జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థవిక్రమ్‌సింగ్ ఒకరిపై వేటు వేశారు. మరొకరిపై విచారణ కొనసాగిస్తున్నారు. కారేపల్లి రేంజ్ పరిధిలోని తాళ్లగూడెం సెక్షన్‌లో పాటిమీదగుంపు(తిమ్మరావుపేట నుంచి చీమలపాడు ప్రాంతం)లో విస్తారమైన అడవీ ఉంది. అయితే కొన్ని నెలలుగా పాటిమీద గుంపు ప్రాంతంలో అటవీ ఆక్రమణలు జరుగుతున్నాయని జిల్లాఅటవీశాఖ అధికారి సిద్దార్థ విక్రమ్‌సింగ్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పెషల్ ఫోర్స్ బలగాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో పాటిమీదగుంపు అటవీ ప్రాంతంలో డోజర్‌లు, జేసీబీలతో ఎకరానికి పైగా అటవీ భూమిని చదును చేస్తుండగా ప్రత్యేక బృందాలు పట్టుకున్నాయి. తర్వాత పూర్తి స్థాయిలో విచారణ చేయగా స్థానిక బీట్ ఆఫీసర్ ఎన్ రమేశ్ పరోక్ష సహకారంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని నిర్ధాణ అయింది. దీంతో రమేశ్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే ప్రాంతంలోని ఊటుకూరు బీట్‌లో కూడా అటవీ ఆక్రమణలు జరుగుతున్నట్లు విమర్శలు రావటంతో విచారణ చేపట్టినట్లు తెలిసింది.

రహదారుల విస్తరణతోనే అభివృద్ధి

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- 36వ డివిజన్‌లో రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రహదారుల విస్తరణ జరిగితేనే అభివృద్ధి జరుగుతుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగరంలోని 36వ డివిజన్‌లో రూ.2.25 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రశాంతమైన నగరంగా ఖమ్మాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని, గాంధీచౌక్ వ్యాపారస్తులు కోరిన విధంగా అభివృద్ధి జరుగుతుందని భరోసా ఇచ్చారు. దశాబ్దాల తెలంగాణ ప్రజలు ఆకాంక్షను ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ నెరవేర్చి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారని, ఆ మేరకు ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని రైతుల శ్రేయస్సుకు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. మన పరిసరాలను మనం పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.మొక్కలను పెంచి పచ్చదనం పెంపుకు భవిష్యత్ ప్రజలు ఆరోగ్యంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఖమ్మంలో రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హనుమంతరావు, స్థానిక కార్పొరేటర్ రాంమోహన్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖపై కలెక్టర్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి):విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేలా ప్రభుత్వ పాఠశాలలు నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి గురువారం విద్యాశాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. యూడీఐఎస్ఈ వివరాల నమోదు, యూనిఫారం,పాఠ్యపుస్తకాల పంపిణీ,అపార్ రిజిస్ట్రేషన్, మధ్యాహ్న భోజనం, బ్యాగ్‌లెస్‌డే నిర్వహణ, కేజీబీవీ, పీఎంశ్రీ పాఠశాలల అభివృద్ధి, తదితర అంశాలపై కలెక్టర్ చర్చించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ర్యాండమైజేషన్ ద్వారా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పారదర్శకంగా కేటాయించినట్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి కామేపల్లి మండలం పింజరమడుగు, ముచ్చర్ల ప్రాంతాల లబ్ధిదారులకు ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ గ్రామాల్లో చాలా రోజులుగా పెండింగ్ ఉన్న 40డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు.

డీసీసీబీ పాలక వర్గాల గడువు పొడిగింపు

ఖమ్మం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్ర సహకారబ్యాంకు పాలకవర్గాలు, సహకారసంఘాల పాలకవర్గాల గడువును మరో ఆరునెలలు పొడిగించారు. ప్రస్తుత పాలకవర్గాల గడువు గురువారం తో ముగియగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలోని డీసీసీబీ ఛైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావుతో పాటు డైరెక్టర్లు, పాలకవర్గం పదవులు ఆరునెలల వరకు గడువు పెరిగింది.ఖమ్మండీసీసీబీ పరిధిలోని 97సహకారసంఘాలు పదవీ కాలం కూడా మరో ఆరునెలలు పొడిగించడంతో ప్రస్తుత పాలకవర్గాలు యధావిధిగా కార్యకలాపాలు సాగించనున్నాయి. ఎన్నికలు కూడా ఇప్పట్లో జరిగే అవకాశం లేదు. ఆరునెలల తర్వాత ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

సీపీఐ నాయకురాలు గురవమ్మ మృతి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని, భాగం నివాళి



కామేపల్లి,ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల సీపీఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు సతీమణి గురవమ్మ (63) అనారోగ్యంతో హైదరాబాద్‌లో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె భౌతికాయానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీకమిటీ సభ్యుడు భాగం హేమంతరావు, సీపీఐ జిల్లా క్యాదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జితేందర్‌రెడ్డి ఆమె భౌతికాయంపై అరుణ పతాకాన్ని ఉంచి నివాళ్లు అర్పించారు.

ఏడుగురి అరెస్టు

మద్యం మత్తులో దాడుల ఘటనలో చర్యలు

ఖమ్మంక్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఇరువర్గాలు పరస్పర దాడుల ఘటనలో 11మందిపై కేసులు నమోదు చేశామని, వారిలో ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ ఏసీపీ రమణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.మద్యంమత్తులో రాకేష్ భార్య దుర్గా భవానితో గొడవ జరిగి బయటకు వచ్చాడు. ఈ నేపథ్యంలో సమీపంలో దుకాణం నడుపుతున్న కవిత, వేణుగోపాల్ మధ్య పాతకక్షల నేపథ్యంలో కొంతమంది ఆకతాయులతో కలిసి దాడులు చేశారు.ఈఘటనలో ఏడుగురికి గురువారం మూత్ర పరీక్షలు నిర్వహించామని ఈపరీక్షల్లో గంజాయి,మాదకద్రవ్యాలు తీసుకోలేదని నిర్ధారణ అయినట్టు తెలిపారు. గంజాయి తీసుకున్న వ్యక్తులు ఎవరైనా 15రోజుల వరకు మూత్రపరీక్షలో తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

తిరుమలాయపాలెం,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన కోసూరి త్రివేణి(30)వ్యవసాయ చేస్తూ జీవిస్తుంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు. రెండేళ్లనుంచి కడుపునొప్పితో బాధపడుతుంది. ఈనేపథ్యంలో సాయంత్రం ఇంటిలో ఎవరు లేని సమయంలో చీరతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ జగదీష్ కేసు నమోదు చేశారు.

జిల్లా ఖజానాశాఖ డీడీగా వెంటపల్లి

ఖమ్మంకలెక్టరేట్,ఆగస్టు14(ఆంధ్రజ్యోతి):జిల్లాఖజానాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా మహబూబాబాద్ జిల్లా ఖజానాశాఖ అధికారి వెంటపల్లి సత్యనారాయణకు అదనపు బాధ్యతలను అప్పగించారు. ట్రెజరీ, అకౌంట్స్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాఖజానా కార్యాలయంలో గురువారం బాధ్యతలను వెంటపల్లి స్వీకరించారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ దురుశెట్టిని మర్యాదపూర్వకంగా కలిశారు.

వరద ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి: డీపీవో

కూసుమంచి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తెలిపారు. గురువారం డీఎల్‌పీవో ఎంపీడీవో రామచంద్రరావుతో కలిసి కూసుమంచి మండలం పాలేరు, నర్సింహలగూడెం, కూసుమంచి, గ్రామాలను పరిశీలించారు. పారిశుధ్యం లోపం తలెత్తకుండా చూడాలన్నారు. పలుసూచనలు చేశారు. ఆయన వెంట డీఎల్‌పీవో రాబాంబు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చేపలవేటకు వెళ్లొద్దు: అడిషనల్ సీపీ ప్రసాద్‌రావు

ఖమ్మంరూరల్: మున్నేరు, చెరువులు, వాగులు తదితర వాటిలోకి చేపలు పట్టేందుకు జాలర్లు ఎవరు వెళ్లొద్దని అడిషనల్ సీపీ ప్రసాద్‌రావు సూచించారు. నాయుడుపేట ప్రాంతంలోని మున్నేరు వరద ఉధృతిని అడిషనల్ సీపీ ప్రసాద్‌రావు, రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి గురువారం పరిశీలించారు.

తిరుమలాయపాలెం: భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని రాకాసితండాను ఆయన సందర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న మోదీ

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఖమ్మంమార్కెట్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూనీ చేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు 'ఓటు చోరీ'కి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం భట్టి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ దేశంలో జరుగుతున్న ఓట్లకు సంబంధించిన సమాచారాన్ని, బతికి ఉన్న వారిని చనిపోయినట్లుగా, ఉన్న ఓట్లను లేనట్లుగా చూపిస్తున్నారని ఆధారాలతో సహా ఎలక్షన్ కమిషన్ సమర్పించారన్నారు. అయినప్పటికీ ఎలాంటి సమాధానం లేదని ఆరోపించారు. ఓటర్ లిస్ట్ సాఫ్ట్ కాపీ ప్రజలందరికీ అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తుంటే.. ప్రభుత్వం ఇవ్వకుండా కక్ష పూరితంగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. దేశ వ్యాప్తంగా ఎన్నికల్లో ఓట్లలో అవకతవకలు జరుగుతున్నాయని ఆధారాలతో సహా తమ నాయకుడు రాహుల్‌గాంధీ బయట పెట్టారని, వాటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఓట్లు చోరీ అవుతున్నందుకే ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి, వాస్తవాలను ప్రజలకు వివరించే కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ చేస్తున్న పోరాటానికి మద్దతుగా ప్రతీ పౌరుడు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కొవ్వొత్తుల ర్యాలీ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమై.. జడ్పీ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కమర్తపు మొరళి, మందడపు మనోహర్, నాయకులు పుచ్చకాయల వీరభద్రం, బేబీ స్వర్ణకుమారి, దొబ్బల సౌజన్య, వెంకన్న, ముక్కా శేఖర్ తదితరులు ఉన్నారు.

స్నానాల లక్ష్మీపురానికి సబ్‌స్టేషన్ మంజూరు

వైరా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. రూ.నాలుగుకోట్ల నిధులతో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించనున్నారు. ఇటీవల కాలంలోనే వైరా టౌన్ పరిధిలో శాంతినగర్‌కు రూ.నాలుగుకోట్లతో రెబ్బవరం గ్రామంలో రూ.నాలుగుకోట్లతో 33/11కేవీ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ఈ రెండు సబ్‌స్టేషన్లకు అవసరమైన స్థలాలను వైరా, కొణిజర్ల రెవెన్యూశాఖ అధికారులు సమకూర్చారు. ఇప్పుడు కొత్తగా స్నానాల లక్ష్మీపురానికి సబ్‌స్టేషన్ మంజూరైంది. స్థల సేకరణ తర్వాత ఈ సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని చేపడతామని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

గుండెపోటుతో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు
జడల కన్నుమూత



కారేపల్లి, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యకారుడు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు జడల వెంకటేశ్వర్లు(68)గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. మండల కేంద్రానికి చెందిన జడల వెంకటేశ్వర్లు శుక్రవారం పని విషయంపై మహబూబాబాద్ వెళ్లారు. అక్కడ ఆయనకు గుండె నొప్పిరావడంతో పక్కనే ఉన్న వారు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్రసాధన కోసం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు, ప్రొఫెసర్ జయశంకర్‌తో పాటు అనేకమంది సీనియర్ నాయకులతో కలిసి అనేక ఉద్యమాలుచేశారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వెంకటేశ్వర్ల మృతి పట్ల పలువురు బీఆర్ఎస్ నాయకులు సంతాపం తెలిపారు.

కుండపోత వర్షం

వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా నాలుగు రోజులుగా కుండపోత వర్షం కురిసింది. వాగులు పొంగి ప్రవహిస్తుండగా చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇళ్లలోకి నీరు చేరింది. వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్షాలతో పలు గ్రామాల్లో పైర్లు నీటమునిగాయి. సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. వర్షాలకు వైరా మండలంలోని తాటిపూడి గ్రామంలో మీరాబీకి చెందిన ఇళ్లు కూలిపోయింది. మండలంలోని విప్పలమడక గ్రామానికి సమీపంలో వైరా రిజర్వాయర్ ఎడమకాల్వలోని లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో గతనెలలో నిర్మించిన సిమెంట్ గైడ్‌వాల్స్ వరదనీటితో కుప్పకూలిపోయాయి. దాదాపు వందమీటర్ల దూరం గైడ్‌వాల్స్ పడిపోయాయి. దాదాపు రూ.ఐదులక్షలకుపైగా నష్టం వాటిల్లింది. ఈ విషయమై నీటిపారుదలశాఖ డీఈ పి.శ్రీనివాస్ మాట్లాడుతూ కాల్వ సిమెంట్ గైడ్‌వాల్స్ పక్కన పోసిన మట్టి నానిపోవడం, ఒకేసారి వరదనీరు వచ్చి పడటంతో ఈ గోడలు కూలాయని తెలిపారు. ఈ సీజన్ అనంతరం తిరిగి పడిపోయిన గోడలను పునర్నిర్మిస్తామని రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.



విప్పలమడకలో నీటమునిగిన పత్తిపైరు



అలుగుపోస్తున్న మాచవరం వాగు



చంద్రుపట్లలో నిండుకుండలా మారిన పెద్దచెరువు



అలుగుపోస్తున్న తామర చెరువు

కోదండ రామాలయంలో సీతమ్మ వారికి సారె

సత్తుపల్లిరూరల్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం సందర్భంగా పట్టణంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయంలో సీతమ్మవారికి మహిళ భక్తులు సీతమ్మ వారికి శుక్రవారం సారె తీసుకెళ్లే కార్యక్రమం నిర్వహించారు. సీతామాత, శ్రీదేవి, భూదేవీలకు రుక్మిణీ సత్యభామ, వాసవీమాతలకు ఒడి నింపు (ఒడిబియ్యం కట్టుట) కార్యక్రమాలు అంగరంగ వైభవంగా సాగాయి. అదేవిధంగా స్థానిక గీతా జ్ఞానమందిరం వరకు వాయిద్యాలతో బయల్దేరి శ్రీ కృష్ణ రుక్మిణీ సత్యభామలకు సారె సమర్పించారు.

మాటూరుపేటలో ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

మధిర రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరుపేట దళిత కాలనీలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు గురువారం ఆగ్రామంలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, విద్యుత్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఏడీఈ అనురాధ, రూరల్ ఏఈ మైథిలి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థ పట్ల విశ్వాసం ఉంది

బోనకల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): న్యాయ వ్యవస్థ పట్ల తెలంగాణ జన సమితికి పూర్తి విశ్వాసం ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ సర్దార్ హుస్సేన్, మండల అధ్యక్షుడు బీరెల్లి వాసులు తెలిపారు. బోనకల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ ఆలీఖాన్‌లు క్రియాశీలక పాత్రను పోషించారని తెలిపారు.

వాహనాల తనిఖీ

తల్లాడ, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తల్లాడలో గురువారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా తల్లాడ-దేవరపల్లి జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా 76 వాహనాల యాజమానుల నుంచి రూ.70,146లు పెండింగ్ జరిమానాలను వసూలు చేశారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు ఎన్.వెంకటకృష్ణ, బి.వెంకటేష్, పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

వైరా, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం గ్రామంలో నారపోగు శ్రీధర్ ఆధ్వర్యంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో తిరంగర్యాలీ నిర్వహించారు. బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు దోసపాటి కల్యాణ్‌రావు ఈ ర్యాలీని ప్రారంభించారు. నారపోగు శ్రీధర్, ఏపూరి శ్రీనివాసరావు, నోముల దుర్గాప్రసాద్, దొంతెబోయిన నర్సింహారావు, శివ కమల్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న
మోదీ ప్రభుత్వం: డిప్యూటీ సీఎం

ఖమ్మం మార్కెట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజాస్వామ్యాన్ని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూనీ చేస్తోందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు 'ఓటు చోరీ'కి నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం నగరంలో నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం భట్టి విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని కాపాడేందుకు నిరంతరం పోరాడుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ దేశంలో జరుగుతున్న ఓట్లకు సంబంధించిన సమాచారాన్ని, బతికి ఉన్న వారిని చనిపోయినట్లుగా, ఉన్న ఓట్లను లేనట్లుగా చూపిస్తున్నారని ఆధారాలతో సహా ఎలక్షన్ కమిషన్ సమర్పించారన్నారు. కొవ్వొత్తుల ర్యాలీ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి ప్రారంభమై.. జడ్పీ సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మందడపు మనోహర్, పుచ్చకాయల వీరభద్రం, బేబీ స్వర్ణకుమారి, దొబ్బల సౌజన్య, వెంకన్న, శేఖర్ ఉన్నారు.

ఆవులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

తల్లాడ, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులను తరలిస్తున్న వ్యాన్‌ను గురువారం తల్లాడలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు స్థానిక రింగ్ రోడ్డు సెంటర్‌లో తల్లాడ ఎస్ఐ బి.వెంకటేష్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కల్లూరు వైపు నుంచి వస్తున్న వ్యాన్‌ను అడ్డుకుని అక్రమంగా తరలిస్తున్న 9 ఆవులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు వ్యాన్ డ్రైవర్ శీతల దుర్గాప్రసాద్ ఆవులను తరలిస్తున్న దేవరపు శివ, ప్రకృతి శివ, హైదరాబాదుకు చెందిన వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అధిక బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నాం

సత్తుపల్లి, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): సంస్థలోని ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గు లక్ష్యంకంటే అధికంగా బొగ్గు ఉత్పత్తి సాధిస్తున్నామని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజు అన్నారు. గురువారం మండలంలోని కిష్టారం ఓసీలో నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంట్ టీం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీజీఎం (ఐఈడీ) ఎన్.యోహాన్, పీవో ఎంవీ.నరసింహారావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు భరోసాగా కమ్యూనిస్టులు

కొణిజర్ల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు నిత్యం అండగా ఉంటూ భరోసాగా ఉండేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయసమితి సభ్యుడు భాగం హేమంతరావు తెలిపారు. గురువారం కొణిజర్లలో గ్రామశాఖ కార్యదర్శి స్వర్ణ రమేష్ అధ్యక్షతన జరిగిన బండారు పుల్లయ్య సంతాపసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, యర్రాబాబు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, తాటి నిర్మల, గడల భాస్కర్‌రావు, కొప్పుల కృష్ణయ్య, తాళ్ళపల్లి కృష్ణ, పాల్గొన్నారు.

అపర కర్మల సత్రం ఏర్పాటు కోసం వినతి

మధిర, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య అపర కర్మల సత్రం ఏర్పాటకు సంబంధించి స్థలం, భవనాన్ని నిర్మించాలని కోరుతూ గురువారం మధిర క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్కకు మండల ఆర్య వైశ్య సంఘ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన ఆయన స్థలాన్ని కేటాయించాలని మధిర మున్సిపాలిటీ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు చారుగుండ్ల నర్సింహామూర్తి, వనమా కిరణ్ కుమార్, వనమా వేణు గోపాలరావు, మిరియాల వెంకటరమణ, రంగా హన్మంతరావు, కుంచెం కృష్ణారావు, చేడే రామకోటేశ్వరరావు, వంగవీటి రాజశేఖర్, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

పంట నష్ట సర్వేను వెంటనే చేపట్టాలి

బోనకల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న పత్తి, వరి పంటలకు సంబందించి సర్వేను వ్యవసాయశాఖ అధికారులు వెంటనే చేపట్టాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, నాయకులు తుళ్లూరి రమేష్, బంధం శ్రీను, జొన్నలగడ్డ సునీత, తెల్లాకుల శ్రీను, చిట్టుమోదు నాగేశ్వరరావు, మర్రి తిరుపతిరావు తదితరులున్నారు.

సింగరేణి అధికారుల నిరసన

సత్తుపల్లిరూరల్, ఆగస్టు14 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా స్థానిక జేవీఆర్ ఓసీలో సింగరేణి అధికారులు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం జేవీఆర్ ఓసీలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. వేతనాల పీఆర్‌పీలో జాప్యం తగదన్నారు. కొంతకాలంగా బిల్లులు, ఐఐటీ/ఐఐఎం ఫీజు రీఎంబర్స్‌మెంట్ వర్తింపు, దీర్ఘకాలికంగా నిలిచిపోయిన ఉద్యోగస్థుల పదోన్నతులు సంస్థ ఇవ్వాల్సిన పలు బకాయిలపై స్పందించాలంటూ సింగరేణి అధికారుల సంఘం సంస్థను డిమాండ్ చేసింది.